

వ్యాసర్పాడి సబ్‌వే వద్ద



నూరడుగుల రోడ్డులో వాహనచోదకుల ఇక్కట్లు

ఈనాడు తమిళనాడు

బుధవారం అక్టోబరు 16, 2024

మహానగరం... మళ్లీ మునిగింది!

■ సహాయక చర్యల్లో యంత్రాంగం

■ కాలనీలు జలమయం

చాలా ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం

రెడ్ అలర్ట్ ప్రకటన



పటాలం వద్ద..

ఈనాడు-చెన్నై

రాష్ట్రంలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. పుదుక్కోట్టై జిల్లా కుడుమియన్మలైలో అత్యధికంగా 13 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గుమ్మిడిపూండి, ఎన్నూరులో 10 సెం.మీ., చెన్నైలోని మణలి, మలర్‌కాలనీ, కొలత్తూరు, టీవీకేనగర్, రాయపురంతో పాటు పొన్నేరిలో 9 సెం.మీ. కురిసింది.

చెన్నైతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు అతిభారీ వర్షాలు మాత్రమే నమోదవుతాయనే హెచ్చరికలు మంగళవారం ఉదయం వరకు మాత్రమే అందాయి. ఆ తర్వాత పరిస్థితి మారింది. వాతావరణం ఒక్కసారిగా మారడంతో అత్యంత భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణశాఖ అప్రమత్తం చేసింది. అందుకు తగ్గట్లే నగరవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో కుండపోత కురిసింది. కాలనీలు జలమయమయ్యాయి.

మంగళవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 వరకు

వర్షపాతం (సెం.మీ.లలో)	ప్రాంతం
19.9	మణలి
18.7	పెరంబూర్
18.7	కొలత్తూరు
18.3	అయపాక్కం
18.0	కత్తివాక్కం
16.8	అన్నానగర్ వెస్ట్
15.7	వేళచ్చేరి
15.4	పుళల్
15.2	అంబత్తూరు
14.9	తిరువొత్తియూరు
13.7	మాధవరం
13.6	బేసిన్‌బ్రిడ్జి
13.5	తండయార్‌పేట్
13.1	అమింజికరై
11.5	మదురవాయల్
11.4	వడపళని
10.4	నుంగంబాక్కం
10.3	వలసరవాక్కం
10.2	మీనంబాక్కం
10.1	ఐస్‌హౌస్
9.8	చెన్నై సెంట్రల్
9.7	ముగలివాక్కం
9.0	ఉత్తండి
8.6	పెరుంగుడి
8.5	షోళింగనల్లూరు
8.1	రాజాఅన్నామలైపురం
7.9	అడయార్
7.5	మడిపాక్కం

చెన్నైకు ముప్పు?

బంగాళఖాతంలోని తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి ఉత్తర తమిళనాడువైపు పయనించవచ్చని వాతావరణశాఖ పేర్కొంది. 17న తెల్లవారుజామున పుదుచ్చేరి, తమిళనాడు నుంచి దక్షిణవైపు ఆంధ్రప్రదేశ్ మధ్య తీరం దాటొచ్చని అంచనాలు వేస్తున్నారు. ఐఎండీ అధికారుల అంచనాల ప్రకారం చెన్నైకి ఉత్తరాన తిరువళ్లూరు జిల్లా మీదుగా వెళ్లొచ్చని భావిస్తున్నారు.

20 సెం.మీ.కు దగ్గరగా..

చెన్నై నగరం, పరిసరాల్లో బుధవారం వర్షాల తీవ్రత భారీగా ఉండొచ్చని వాతావరణ నిపుణులు ప్రదీప్‌జాన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 20 సెం.మీ. దగ్గరగా అత్యంత భారీ వర్షాలు కురవొచ్చని హెచ్చరికలు చేస్తున్నారు. మరోవైపు వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం బుధవారం సైతం రెడ్‌అలర్ట్ ప్రకటించారు. భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదవుతాయని హెచ్చరిస్తున్నారు. ఇదే తీవ్రత తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోనూ కొనసాగనున్నట్లు అంచనా వేశారు.

16వ తేదీ..

● రెడ్ అలర్ట్ (భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు)-చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలు.

● ఆరెంజ్ అలర్ట్(భారీ నుంచి అతిభారీ వర్షాలు) - రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, పెరంబలూర్, అరియలూర్, మయిలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, కడలూర్, విళుపురం, వేలూర్ జిల్లాలతో పాటు పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాలు.

● ఎల్లో అలర్ట్(భారీ వర్షాలు) - తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, తిరుచ్చి, పుదుక్కోట్టై జిల్లాలు.

17వ తేదీ..

● ఆరెంజ్ అలర్ట్- తిరువళ్లూరు, రాణిపేట, వేలూర్, తిరుపత్తూర్, కృష్ణగిరి జిల్లాలు. ● ఎల్లో అలర్ట్- చెన్నై, ఈరోడ్, సేలం, ధర్మపురి, తిరువణ్ణామలై, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలు. ● 19 వరకు తమిళనాడులోని పలు ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు ఉండొచ్చని హెచ్చరించారు.

హెల్ప్‌లైన్ నెంబర్లు విడుదల

ప్యారిస్, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో చెన్నై కార్పొరేషన్ తరఫున హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రకటించారు. వర్షానికి సంబంధించిన ఫిర్యాదులు, సహాయక చర్యలకు 1913ను సంప్రదించవచ్చని తెలిపింది. కంట్రోల్ రూమ్ 044 2561 9204, 2561 9206, 2561 9207కి, నమ్మ చెన్నై యాప్, కార్పొరేషన్ సామాజిక మాధ్యమాల్లోనూ ఫిర్యాదులు చేయొచ్చని పేర్కొంది.

ప్యారిస్: భారీ వర్షాలకు ఇళ్లలోకి ప్రవేశించే పాములు, ఇతర విష పురుగుల గురించి సమాచారం అందించేందుకు అటవీశాఖ హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రకటించింది. చెన్నై కార్పొరేషన్ వరద నియంత్రణ కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నెంబరు 1093కి, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, కోయంబత్తూరు, మదురై జిల్లాల్లో కంట్రోల్ రూమ్ నెంబరు 1077కు తెలియజేయాలని పేర్కొంది.

తమిళనాడు, పుదుచ్చేరిలో నేడు పాఠశాలలకు సెలవు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోని పాఠశాల, కళాశాలలకు బుధవారం కూడా సెలవు ప్రకటించారు. పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని పాఠశాల, కళాశాలలకు కూడా బుధవారం సెలవు ప్రకటించారు.

అతలాకుతలం..

చెన్నై నగరంతోపాటు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాలకు మంగళవారం రెడ్‌అలర్ట్ ప్రకటించారు. భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు నమోదయ్యాయి. ఉరుములు, మెరుపుల తీవ్రత బాగా కనిపించింది. సోమవారం రాత్రి నుంచే నగరవ్యాప్తంగా వర్షాల ప్రభావం కనిపించింది. సోమ, మంగళవారాలు కురిసిన వర్షాలతో నగరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ స్తంభించింది. తరమణి, అడయార్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు వెళ్లాయని ఫిర్యాదులు వచ్చాయి. అన్నానగర్‌లో వరద తీవ్రత పెరిగినట్లు స్థానికులు పెద్దఎత్తున అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్తు కోతలున్నాయని ఫిర్యాదులు పలు ప్రాంతాల నుంచి వచ్చాయి. చాలా జోన్లలో వరద తీవ్రత పెరుగుతుండటంతో విపత్తు నివారణ సిబ్బంది, జీసీసీ యంత్రాంగం, ఫైర్, రెస్క్యూ సిబ్బంది రంగంలోకి దిగారు. లోతట్టుప్రాంత వాసుల్ని పునరావాస కేంద్రాలకు తరలించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా సహాయక సిబ్బంది, యంత్రాలను లోతట్టు ప్రాంతాలకు పంపడంతో పనులు వేగంగా జరిగాయి. చాలా ప్రాంతాల్లో ముంపు సమస్యలు తొలగినట్లు చెబుతున్నారు. మరోవైపు పలుచోట్ల మంగళవారం సాయంత్రానికి సమస్యలు తీరలేదనే ఫిర్యాదులు అందాయి.



చెన్నైకి ఉత్తరం వైపు 17న వాయుగుండం వెళ్లొచ్చని వాతావరణశాఖ విడుదల చేసిన ఊహాచిత్రం





గిండి ప్రధానరోడ్లలో ఇలా..(జీసీసీ యంత్రాంగం స్పందించి యంత్రాలతో నీటిని తోడేసింది) ● కొలత్తూరు అంజుగంనగర్‌లో ఇంటి ఆవరణలోకి చేరిన నీరు



చెన్నై పటాలంలో ..



అన్నానగర్ దారుల్లో..



వడపళనిలో ట్రాఫిక్‌కు అంతరాయం



వేళచ్చేరిలో..



వ్యాసర్పాడి ముళ్లైనగర్‌లో రహదారిపై..



ఫ్రంట్‌లైన్ సిబ్బందికి టీ ఇస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తోడుగా ఉంటా..

ప్యారిస్, న్యూస్‌టుడే: వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించారు. చెన్నై పుళియంతోప్పులో వాననీటిని తొలగిస్తున్న ఫ్రంట్‌లైన్ సిబ్బందిని అభినందించారు. పక్కనే ఉన్న స్టాల్‌కి తీసుకెళ్లి టీ తాగించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ తరఫున 21 వేల మంది సిబ్బంది షిఫ్టు విధానంలో 14 జోన్‌లలో పనులు చేస్తున్నారు. చెన్నై మెట్రోపాలిటన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు తరఫున 2,149 మంది, విద్యుత్తు బోర్డు తరఫున చెన్నైలో 5 వేల మందికి పైగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

● ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో స్వార్థం చూడకుండా, సమయం పట్టించుకోకుండా ప్రజల కష్టాలు తీర్చేది పారిశుద్ధ్య కార్మికులు, కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు అని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. వారితో పాటు తానూ ఫ్రంట్‌లైన్ సిబ్బందిగా తోడుంటానని సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు.

ముమ్మరంగా సహాయక చర్యలు



డాక్టర్ బెసెంట్ సాలైలో వాననీటి తొలగింపును పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

ప్యారిస్, వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నైలో 300 సహాయక శిబిరాలు సిద్ధంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మంగళవారం ఎళిలగంలోని రాష్ట్ర అత్యవసర కంట్రోల్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చెన్నైలో 89 పడవలు, ఇతర జిల్లాల్లో 130 పడవలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. చెన్నైలో 300, చుట్టుపక్కల జిల్లాల్లో 631 సహాయక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. చెన్నైలో 15 మంది ఐఏఎస్ అధికారులు, అన్ని జిల్లాల్లో సీనియర్ ఐఏఎస్ అధికారులను వరదను పర్యవేక్షించడానికి నోడల్ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. చెన్నైలో 13 వేల మంది వాలంటీర్లు నివారణ, సహాయక పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. చెన్నైలో 8 ప్రాంతాల్లో వృక్షాలు నేలకూలాయని, వాటిని తొలగించారని తెలిపారు. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయాలని ఇదివరకే చెప్పామన్నారు. పాఠశాలల సెలవు విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

ఒక్కరికి జ్వరం ఉన్నా వైద్య శిబిరం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వర్షాకాలంలో ఒకరికి జ్వరం ఉన్నా ఆ ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించాలని అధికారులకు సూచించామని ఆరోగ్యశాఖ మంత్రి మా. సుబ్రమణియన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం వెయ్యిచోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. చెన్నై మైలాపూర్‌లోని కమ్యునిటీహాల్‌లో శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి జ్వరాలకు వైద్యం అందించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే ప్రజలు 104 నెంబర్ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

వర్ష బాధితులు డీఎండీకే కార్యాలయానికి రావచ్చు: ప్రేమలత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: లోతట్టు ప్రాంతాల్లో నివారు, వర్ష బాధితులు భోజనం, వసతికి డీఎండీకే కార్యాలయానికి రావచ్చని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు 96 శాతం పూర్తి చేసినట్లు డీఎంకే చెబుతోందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. వర్షపునీటి పారుదల పనులు, మెట్రో ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యుత్తు స్తంభాలు, హైవోల్టేజీ తీగలు పరిశీలించాలని, సరఫరాలో కోతల్లేకుండా చూడాలని కోరారు. వర్ష బాధితులకు అవసరమైన వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. డీఎండీకేకు చెందిన అన్ని జిల్లాల కార్యదర్శులు, నిర్వాహకులు, కార్యకర్తలు వర్ష బాధిత ప్రాంతాల్లో అవసరమైన సహాయాలు వెంటనే అందించాలని సూచించారు.

అప్రమత్తమైన దక్షిణ రైల్వే

వడపళని, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ రైల్వే అప్రమత్తమైంది. వర్షం, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని నీరు నిల్వ ఉన్న చోట్ల రైళ్లు తక్కువ వేగంతో నడుస్తాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వాతావరణ పరిస్థితులను అనుసరించి కొన్ని రైళ్లను పాక్షిక రద్దు లేదా టెర్మినళ్లలో మార్పులు కూడా చేసే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తాజా రైళ్ల సమాచారం కోసం ప్రసార మాధ్యమాలను అనుసరించాలని విజ్ఞప్తి చేసింది. సమాచారం కోసం 24/7 హెల్ప్‌లైన్ 139 నెంబరు, చెన్నై డివిజన్ 044 - 2533 0952, 044-2533 0953 నెంబర్లు సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'తమిళనాడు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ' హెల్ప్‌లైన్ నెంబరు 1070, జిల్లా హెల్ప్‌లైన్ 1077, వాట్సాప్ నెంబరు 94458 69848లోనూ సంప్రదించవచ్చని పేర్కొంది. శిబిరాలు, ఆహార రవాణా, వరద వాలంటీర్లకు 1913 హెల్ప్‌లైన్‌ను సంప్రదించొచ్చు.

టీవీకే మహానాడు భద్రతకు 10వేల మంది వాలంటీర్లు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నటుడు విజయ్ తమిళగ వెట్రి కళగం(టీవీకే) మహానాడు 27న విక్రవాండి సమీపంలోని వి.సాలైలో జరగనున్న విషయం తెలిసిందే. ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఆహ్వానం, ఆహారం, రవాణా, వాహన పార్కింగ్ తదితర పలు అంశాలకు 27 ప్రత్యేక కమిటీలను పార్టీ అధ్యక్షుడు విజయ్ నియమించారు. తాజాగా సాంకేతిక పనులు.. భద్రత, వాలంటీర్ల సమన్వయం, వీడియో ప్రదర్శన కమిటీలను ఏర్పాటు చేశారు. సాంకేతిక వ్యవహారాల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, సెక్యూరిటీ ఆఫైర్స్ కోఆర్డినేటింగ్ కమిటీతో కూడిన ప్రత్యేక విభాగం మహానాడులో అధ్యక్షుడి ప్రత్యేక రక్షణకు ఏర్పాటైన ప్రైవేట్ భద్రతా దళాలను పర్యవేక్షిస్తుంది. ఈ భద్రతా దళాలు పోలీసుశాఖ నిబంధనలకు అనుగుణంగా పని చేస్తాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కార్యకర్తలు, ప్రజలకు సహాయం అందించేందుకు యూనిఫామ్ ధరించిన 10వేల మందికి పైగా వాలంటీర్లు పనిచేస్తారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.





అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు స్వామినాథన్, మా.సుబ్రమణియన్ తదితరులు

కలాం స్ఫూర్తిని అందుకోవాలి: స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గర్వపడేలా యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకాంక్షించారు. కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. కష్టపడితే కలలను సాకారం చేసుకోవచ్చని కలాం యువతలో స్ఫూర్తి నింపారని తెలిపారు. డీఎంకే అధికారంలోకి వచ్చాక కలాం చదివి, పాఠాలు బోధించిన అన్నా యూనివర్సిటీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ రంగాల్లో కృషి చేసే తమిళులకు ఏటా స్వాతంత్ర్య దినోత్సవం రోజున డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత విద్యలో రాణిస్తూ ఆయన గర్వపడేలా చేయాలని తెలిపారు. కలాం చిత్రపటానికి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళులు అర్పించారు.



రాజ్‌భవన్‌లో నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ఎలాంటి నష్టం లేకుండా వర్షాలు ఎదుర్కొందాం: అన్నామలై

సైదాపేట, న్యూస్‌టుడే: వర్షాలను ఎలాంటి నష్టం లేకుండా ఎదుర్కొందామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... గతంలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాల్లోని ప్రజలు కొన్ని రోజులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన పునరావాస కేంద్రాలు, ఆహారం తదితర కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు రోడ్లపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నారు. ఎలక్ట్రిక్ ఉపకరణాలు ఉపయోగించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీటి వనరుల వద్దకు వెళ్లరాదని, ఎలాంటి నష్టం లేకుండా వర్షాలను ఎదుర్కొందామని భరోసానిచ్చారు.



తిరుమంజనం కార్యక్రమంలో అర్చకులు, అధికారులు

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని టీనగర్ జీఎన్ శెట్టి రోడ్ శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. వర్షం భారీగా కురుస్తున్నా భక్తులు తరలివచ్చారు. తితిదే తమిళనాడు విభాగ ఏఈఓ కె. పార్థసారథి, పద్మావతి అమ్మవారి ఆలయ సూపరింటెండెంట్ కె.పుష్పలత, తితిదే సిబ్బంది శీను తదితరులు పాల్గొన్నారు.

పైనడక మార్గాలు ఉపయోగించండి

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నగరవ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలు మరో రెండు రోజుల పాటు పడతాయని వాతావరణ విభాగం పేర్కొన్న నేపథ్యంలో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) మెట్రో ప్రయాణికులు, ఇతరులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓ ప్రకటన విడుదల చేసింది.

- మెయిన్ రోడ్డు మీదుగా సెయింట్ థామస్ మౌంట్ మెట్రో స్టేషనుకు వచ్చే వారికి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతాయని, కావున సెయింట్ థామస్ మౌంట్ సబర్బన్ స్టేషను వద్దనున్న పైనడక దారి గుండా మెట్రో స్టేషనుకు చేరుకోవాలని సూచించింది.
- రోడ్డు మార్గంగా వచ్చే ప్రయాణికులు అరిజ్ఞర్ అన్నా ఆలందూరు మెట్రో స్టేషను నుంచి సేవలు వినియోగించుకోవాలి.
- బర్నబి రోడ్డు, కోయంబేడులో నీరు నిలవడంతో కోయంబేడు మెట్రో స్టేషనుకు వెళ్లాల్సిన ప్రయాణికులు పూనమల్లి హైరోడ్డులోని రోహిణీ థియేటరు వద్దనున్న పైనడక దారి మార్గంగా వెళ్లాలి.
- భద్రత దృష్ట్యా డాక్టర్ ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ మెట్రో స్టేషను బీ1 ప్రవేశ ద్వారం (పార్కు వైపు నుంచి) వద్దనున్న ఎస్కలేటరును తాత్కాలికంగా మూసివేశారు. ప్రయాణికులు మెట్ల మార్గంగా మెట్రో స్టేషనుకు జాగ్రత్తగా చేరుకోవాలి.
- మంగళవారం నుంచి గురువారం వరకు వాన నీరు నిలిచి ఉంటుంది కాబట్టి కోయంబేడు మెట్రో, అరుంబాక్కం మెట్రో, సెయింట్ థామస్ మెట్రో స్టేషన్ల వద్ద ప్రయాణికులు తమ వాహనాలు పార్కు చేసుకోరాదు. వాతావరణ పరిస్థితులకు తగినట్టు సమాచారం అందిస్తారు.
- అత్యవసర పరిస్థితుల్లో మహిళా ప్రయాణికులు 155370, ఇతరులు 1800 425 1515 హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించవచ్చు.




ఆర్కేనగర్: వర్షంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు ◗ వేళచ్చేరి: ఎన్నెల్సీ ఒప్పంద కార్మికులు..

పుదువై సీఎం ఇంటి ముందు ఒప్పంద ఉపాధ్యాయుల ఆందోళన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, బాల సేవా కార్మికులు గత ఐదేళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వీరు తమను పర్మినెంట్ చేయాలని పలుమార్లు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు తదితర 288 మంది సోమవారం రాత్రి ముఖ్యమంత్రి రంగసామి ఇంటి ముందు జోరు వర్షంలోనూ గొడుగులు పట్టుకొని ఆందోళన చేశారు. ఆ సమయంలో అప్పా పైత్తియస్వామి ఆలయంలో సీఎం పూజలో ఉన్నారు. దీంతో ఉపాధ్యాయులు ఆలయం వద్దకు వెళ్లి సీఎంతో మాట్లాడారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చలు జరిపి అక్కడి నుంచి పంపించేశారు.

దీపావళి బోనస్‌కు ఎన్నెల్సీ ఒప్పంద కార్మికులు..


వేళచ్చేరి: కడలూర్ జిల్లా నైవేలిలో నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ ఉంది. ఇక్కడ సుమారు 13వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా దీపావళిని పురస్కరించుకొని ఎన్నెల్సీ ఉద్యోగులకు 20 శాతం మేరకు రూ.1.50లక్షల బోనస్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు 20 శాతం బోనస్ ఇవ్వాలని ఒప్పంద కార్మికులు డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం జీవీ ఒప్పంద కార్మిక సంఘం తరపున నైవేలి పెరియార్ స్క్వేర్ ఎదుట వర్షంలో తమ కుటుంబాలతో కలిసి ఆందోళనకు దిగారు. తమ కోరిక మేరకు బోనస్ ఇవ్వకుంటే ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని జీవీ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి ఆంథోని సెల్వరాజ్ ప్రకటించారు.

మానవ హక్కుల కమిషన్ ఎదుట ఏసీపీ హాజరు

ప్యారిస్, న్యూస్‌టుడే: రౌడీలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తిరువొత్తియూర్ పోలీసు సహాయ కమిషనర్(ఏసీపీ) ఇళంగోవన్ మానవ హక్కుల కమిషన్‌లో హాజరయ్యారు. నేరాలకు పాల్పడకూడదని, లేదంటే ఎన్‌కౌంటర్ చేసే అవకాశం ఉందని ఇళంగోవన్ రౌడీల ఇళ్ల వద్దకు వెళ్లి మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వీడియో ఆధారంగా మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ చేపట్టింది. ఇళంగోవన్ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.

సాగుకు నష్టం కలిగించే పరిశ్రమలు తీసుకురాకూడదు: వేల్‌మురుగన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్‌ను డెల్టా జిల్లాగా ప్రకటించాలని, వ్యవసాయానికి నష్టం వాటిల్లే పరిశ్రమలు తీసుకురాకూడదని తమిళగ వాల్వురిమై కట్చి అధ్యక్షుడు వేల్‌మురుగన్ తెలిపారు. ఓఎన్‌జీసీ కొత్త చమురు బావులు తవ్వకూడదంటూ 2018లో నిర్వహించిన పోరాటంలో పాల్గొన్న తిరుమావళవన్, వేల్‌మురుగన్ తదితర 21మందిపై కేసు నమోదైంది. విచారణ నిమిత్తం మంగళవారం తంజావూర్ కోర్టులో వేల్‌మురుగన్ హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివిధ దశల ఆందోళన తర్వాత కావేరి డెల్టాను రక్షిత వ్యవసాయ మండలంగా ప్రకటించారని చెప్పారు. ప్రజల సమస్యలపై చేసిన పోరాటంలో నమోదైన కేసులు వాపస్ తీసుకోవాలని కోరడంతో వెయ్యికిపైగా కేసులను డీఎంకే ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు.



నగరంలోని ఓ హోటల్‌లో శివశంకరి చంద్రశేఖరన్ ఛారిటీస్ తరఫున జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి పాల్గొని అక్షర అవార్డు నాగ రత్నం కృష్ణన్, అంబైకి సూర్య అవార్డు అందించారు.
- ప్యారిస్, న్యూస్‌టుడే

'టూర్స్, ఫ్రాన్స్' వర్సిటీతో 'ఐఐటీఎం' ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: సస్టెయినబుల్ బయో మాన్యుఫ్యాక్చరింగ్ కోర్సు (ఎస్‌బీసీ)ను బోధించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం) 'టూర్స్, ఫ్రాన్స్' వర్సిటీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 'గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్స్' (జీఐఏఎన్) ప్రోగ్రామ్ కింద అంతర్జాతీయ వర్సిటీలతో కలిసి అభివృద్ధి చేసేందుకు కోర్సును అందిస్తున్నట్టు ఐఐటీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన 'బయోఈ3 పాలసీ' విధానంలో భాగంగా కోర్సును ప్రవేశపెట్టినట్టు తెలిపింది. ఐఐటీఎంలో వారికే కాకుండా ఇతరులైన పరిశోధకులు, పారిశ్రామికరంగ నిపుణులు, ప్లాంట్ బయోటెక్నాలజీ, బయోప్రాసెస్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీలో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ చదువుతున్న వారు కూడా అర్హులు. గుర్తింపు ఉన్న వర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యక్షంగా హాజరయ్యేందుకు 30 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నవంబరు 22లోగా రిజిస్ట్రేషను చేసుకోవాలి. డిసెంబరు 2 నుంచి 14వ తేదీ వరకు కోర్సు బోధిస్తారు. పూర్తి వివరాలకు https:///short-url.at/23b9H లింకుపై సంప్రదించాలి. ఐఐటీ బయోటెక్నాలజీ విభాగ ఆచార్యులు స్మితా శ్రీవత్సవ, టూర్స్ ఫ్రాన్స్ వర్సిటీ బయోమాలెక్యులెస్, ప్లాంట్ బయోటెక్నాలజీస్ లేబొరేటరీ డైరెక్టర్, ఆచార్యులు నాతాలీ గిగ్లీవోలి గుయివార్చ్ కోర్సు గురించి వివరించారు.

సదుపాయాలు మెరుగు పరిచేవరకు సిమ్‌కార్డులు విక్రయించొద్దు

■ జియోకు తిరువారూర్ వినియోగదారుల కోర్టు తీర్పు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇంటర్నెట్ సేవలు సరిగా లభించని కారణంగా సిమ్ కార్డుల విక్రయాలను నిలిపివేయాలని తిరువారూర్ వినియోగదారుల కోర్టు రిలయన్స్ జియో సంస్థను ఆదేశించింది. తిరువారూర్ జిల్లా వలంగైమాన్ పంచాయతీ పరిధిలోని తెన్నకులవెలి, వడకులవెలి గ్రామాలకు చెందిన నటనసికామణి, రాజ్‌కుమార్, షేక్ అబ్దుల్లా, రమేష్, నటరాజజన్, వెంకటేష్, గోకుల్‌రాజ్, మదియళగన్ అనేవ్యక్తులు వినియోగదారుల కోర్టులో జియో కంపెనీపై గత మే నెలలో కేసు వేశారు. అందులో.. తాము జియో సిమ్ ఉపయోగిస్తున్నామని, నెట్‌వర్క్ సరిగా లేక ఇంటర్నెట్ సేవలు సక్రమంగా పొందలేకపోతున్నామన్నారు. సంబంధిత కంపెనీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ ఛైర్మన్ మోహన్‌దాస్, సభ్యుడు బాలు ఈ కేసులో తీర్పునిచ్చారు. వలంగైమాన్ పరిధిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే వరకు జియో కంపెనీ సిమ్‌కార్డులు విక్రయించకూడదని, ఫిర్యాదుదారులు తమ లింక్‌ను స్వీకరించిన తేదీ నుంచి ఇప్పటివరకు చెల్లించిన రుసుమును సంవత్సరానికి 9శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని తీర్పు ఇచ్చారు. ఫిర్యాదుదారుల మానసిక క్షోభకు పరిహారంగా ఒక్కొక్కరికి రూ.20వేలు, వ్యాజ్య ఖర్చు కింద తలా రూ.10వేలు 30రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.



కార్యక్రమంలో త్రిపాఠి శశి, దినేష్ కె.త్రిపాఠి తదితరులు

'సమర్థక్' నౌక సేవలు ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సమీపంలోని కాట్టుపల్లిలో 'లార్సెన్ అండ్ టోబ్రో' సంస్థ తయారు చేసిన 'సమర్థక్' నౌక సేవల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. భారత నావికా దళానికి ఈ నౌక రెండు రకాలుగా ఉపయోగపడుతుందని రక్షణశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'నావల్ వైఫ్స్ వెల్ఫేర్ అసోసియేషన్' (ఎన్‌డబ్ల్యుడబ్ల్యుఏ) అధ్యక్షురాలు త్రిపాఠి శశి సేవలను ప్రారంభించారు. నావల్ చీఫ్, అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి నౌక గురించి వివరించారు. 15 నాటికల్ మైళ్ల వేగంతో నడిచే నౌక పొడవు 106 మీటర్లు, వెడల్పు 16.8 మీటర్లు.

త్వరలో పాంబన్ వంతెన ప్రారంభం

ప్యారిస్, న్యూస్‌టుడే: పాంబన్ కొత్త రైల్వే వంతెనను అక్టోబరు చివరిలోగా ప్రారంభిస్తామని దక్షిణ రైల్వే అదనపు జనరల్ మేనేజరు తెలిపారు. రామేశ్వరం-పాంబన్ మధ్య సముద్రంపై రూ.545 కోట్ల వ్యయంతో కొత్తగా రైల్వే వంతెన నిర్మించారు. సుమారు 2 కి.మీ దూరం ఉన్న వంతెన మధ్య భాగంలో 77 మీటర్ల పొడవు, 650 టన్నుల బరువున్న వర్టికల్ ఆకారంలో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. వంతెనపై ప్రయోగాత్మకంగా రైళ్లను నడిపారు. ఈ నేపథ్యంలో దక్షిణ రైల్వే అదనపు జనరల్ మేనేజరు కౌశిక్ కిషోర్ సోమవారం వంతెన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రైల్వే భద్రతా కమిషనరు పరిశీలించిన తర్వాత ప్రారంభ తేదీ ప్రకటిస్తారని చెప్పారు. రామేశ్వరం-ధనుష్కోటి మధ్య రైల్వే మార్గం నిర్మాణానికి స్థల సేకరణ సమస్యగా ఉన్నట్లు తెలిపారు. పాత వంతెన మధ్య ఉన్న లిఫ్ట్ వంతెనను సురక్షితంగా తొలగించి రామేశ్వరం లేదా మండపంలో స్మారక చిహ్నంగా ఏర్పాటు చేయడంపై చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్‌కార్డుల్లో సవరణలకు కొత్త విధానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రేషన్‌కార్డుల్లో పేరు తొలగించడానికి కొత్త విధానం అవలంబిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడానికి, తొలగించడానికి సూచించిన ధ్రువీకరణపత్రం సమర్పించాల్సి ఉంది. ఈ క్రమంలో కుటుంబంలో మృతి చెందిన వారి పేరు తొలగించాలంటే మరణ ధ్రువీకరణపత్రం సమర్పించాలి. వివాహమైతే వివాహ ధ్రువీకరణపత్రాన్ని అందజేయాలి. దీన్ని ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను సర్టిఫికెట్ల లభ్యతను బట్టి ఆమోదిస్తారు. ఈ పద్ధతిలో అధికారులు ప్రస్తుతం ప్రత్యక్ష పరిశీలన జరుపుతున్నారు. తప్పుడు సమాచారం, దరఖాస్తులు సక్రమంగా లేని కారణంగా వందలాది దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. దరఖాస్తుల ఆధారంగా పలు రేషన్‌కార్డులలో బతికున్నవారి పేర్లు తొగిస్తున్నట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీంతో కార్డు నుంచి పేరు తొలగించడానికి అధికారులు వ్యక్తిగత క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేశారు. ఏడాది తర్వాత ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభమైంది. 2023 నుంచి 2.9 లక్షల దరఖాస్తులు అందగా 1.3 లక్షల కొత్త కార్డులు అందజేశారు. ప్రస్తుతం విడాకులు, దత్తత మినహా ఇతర విషయాలకు వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం మాత్రమే అంగీకరిస్తున్నట్టు సంబంధిత శాఖాధికారులు తెలిపారు.

కందిపప్పు, పామోలిన్ కొరత లేదు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రత్యేక ప్రజా పంపిణీ పథకం కింద కందిపప్పు, పామోలిన్ నూనె కొరత లేకుండా రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్నట్టు ఆహారశాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఈ మేరకు దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు అవసరమైన కందిపప్పు, పామోలిన్ ప్యాకెట్‌లు ఓపెన్ టెండర్ ద్వారా కొనుగోలు చేయడానికి గత నెల 10వ తేదీ బిడ్లు తెరచి మూడు నెలలకు అవసరమైన 51,000 మెట్రిక్ టన్నుల కెనడా కందిపప్పు తక్కువ ధరకు కోట్ చేసిన 5 సంస్థలకు, 6 కోట్ల పామోలిన్ ప్యాకెట్‌లు తక్కువ ధరకు కోట్ చేసిన 4 సంస్థలకు గత నెల 16వ తేదీ కొనుగోలు ఉత్తర్వులు అందజేసినట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం సదరు సంస్థల నుంచి పొందిన పప్పు, పామోలిన్ గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు పంపుతున్నట్టు తెలిపారు. ఈ నెల 1వ తేదీ రేషన్ దుకాణాలలో 9,324 మెట్రిక్ టన్నుల పప్పు నిల్వ ఉన్నట్టు వివరించారు. ఈ నెల 14న నిల్వ ఉన్న 8,065 మెట్రిక్ టన్నుల కందిపప్పు రేషన్‌కార్డుదారులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ తరగతులు నిర్వహించొద్దు

ఆర్కేనగర్: భారీవర్షాల వలన సెలవులు ప్రకటించిన జిల్లాల్లోని పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు వాయిదా వేయాలని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. ఆయన తన ఎక్స్ పేజీలో... భారీవర్షాలు, బలమైన గాలులు వీస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటారని, అందువలన వర్షాలు తగ్గేవరకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించకూడదని అన్ని పాఠశాల నిర్వాహకులను కోరారు.



చెరువులోని చెట్లపై వాలిన పక్షులు

వేడంతాంగళ్‌కు చేరుకుంటున్న వలస పక్షులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపంలోని వేడంతాంగళ్ గ్రామం పక్షుల శరణాలయంగా ఉంది. ఇక్కడ అటవీశాఖ పరిరక్షణలో ఉన్న 86 ఎకరాల విస్తీర్ణం, 16 అడుగుల లోతుగల చెరువులో వలస పక్షుల కోసం శరణాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాలు ప్రారంభంకాక ముందే చెరువు పరిసరాల్లో కురుస్తున్న వానలకు చెరువులో సుమారు 10 అడుగుల మేర నీరుంది. ఈనెల మొదటి వారం నుంచే పక్షుల రాక ప్రారంభమైంది. సీజను వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. ఈనెల మొదటి వారం నుంచి అనేక దేశాల నుంచి వలస పక్షులు సుమారు 400కు పైగా వచ్చినట్లు అటవీశాఖ తెలిపింది.

నిరాశ్రయులకు సహకారం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సీఎండీఏ అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. చెన్నైలో 1.20 లక్షల గృహాలను బోర్డు నిర్వహిస్తోందన్నారు. నిర్వాసితుల సౌకర్యార్థం బోర్డు ప్రధాన కార్యాలయంలో 044-29862104 నెంబరుతో 24గంటలు పని చేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తోడటానికి పంపుసెట్లు, జేసీబీ యంత్రాలను సిద్ధంగా ఉంచామన్నారు. పెరుంబాక్కం, కన్నగినగర్, ఒక్కియం తురైపాక్కం ప్రాంతాల్లో మోటార్లు, జనరేటర్లు, జేసీబీ యంత్రాలను సిద్ధంగా ఉంచామన్నారు.



రాయపేట పీటర్స్‌రోడ్డులో వంతెన కింద నిరాశ్రయులైన కుటుంబం

కాంట్రాక్ట్ బస్సులు నడిపేందుకు చర్యలు : మంత్రి శివశంకర్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రైవేటు బస్సులను కాంట్రాక్టు పద్ధతిలో నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ తెలిపారు. పెరంబలూర్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆమ్నీ బస్సుల యజమానులతో చర్చలు జరిపేందుకు ఈనెల 24వ తేదీ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆమ్నీ బస్సుల్లో అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమైన పండుగ సమయాల్లో ప్రైవేటు బస్సులను కాంట్రాక్టు పద్ధతిలో నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆ మేరకు దీపావళికి ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు ప్రైవేటు బస్సులను నడపనున్నామని పేర్కొన్నారు. మామూలు రోజుల్లో రాష్ట్రంలో 20 వేల బస్సులు నడుస్తున్నాయని, పండుగ సీజన్లలో మరో 4 నుంచి 5 వేల వరకు నడపడానికి బస్సులను కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం కాంట్రాక్టు పద్ధతిలో పలు రూట్లలో ప్రైవేట్ బస్సులను నడపడం అనివార్యమన్నారు.

'వందే భారత్'లో ఆహారం అధ్వానం: నటుడు పార్తిబన్



పార్తిబన్ రాసిన ఫిర్యాదు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వందే భారత్‌లో తనకు వడ్డించిన ఆహారం నాణ్యతగా లేదని నటుడు, దర్శకుడు పార్తిబన్ ఎక్స్ పేజీలో పోస్టు పెట్టారు. చెన్నై సెంట్రల్ నుంచి కోయంబత్తూర్‌కు వెళ్లే వందే భారత్ రైలులో ఆయన ఈనెల 13న పయనించారు. ఫుడ్ సర్వర్ల సేవలు బాగున్నాయని, రాత్రి వడ్డించిన చికెన్ అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. ఆహారంలో నాణ్యత లేదని, ఇది ప్రయాణికులకు ఉపయోగపడదని ఫిర్యాదు పుస్తకంలో కూడా రాసినట్లు పేర్కొన్నారు. పార్తిబన్ పోస్టుపై పలువురు స్పందించారు. ప్రజలకు మంచి జరగాలంటే ఎవరైనా ముందుకు రావాలని, మీరు అద్భుతమైన పని చేశారని మెచ్చుకున్నారు. ఆయనకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు రైల్వే మేనేజ్‌మెంట్ తెలిపింది. ఫుడ్ సర్వీస్ లోపానికి సంబంధించి సంబంధిత ఫ్రాంచైజీపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది.

జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలు

వేలూర్, న్యూస్‌టుడే: భారత పిల్లల సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో వేలూర్‌లో జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలు మంగళవారం నిర్వహించారు. డీఆర్వో మాలతి పోటీలను ప్రారంభించారు. 79 పాఠశాలలకు చెందిన 277 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 5, 9, 10, 16 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. విజేతలకు మాలతి బహుమతులు ప్రదానం చేశారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భూ మోసాలకు పాల్పడిన అధికారులపై చర్యలు

పుదువై ఎల్జీ కైలాష్‌నాథన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఈస్ట్‌బీచ్ రోడ్డులోని రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ అత్యవసర సహాయ కేంద్రాన్ని మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ పరిశీలించారు. కార్యదర్శి నెడుంచొళియన్, కలెక్టర్ కులోత్తుంగన్ తదితరులు ఆ ప్రాంతంలో చేపడుతున్న చర్యలను ఎల్జీకి వివరించారు. అనంతరం కైలాష్‌నాథన్ విలేకరులతో మాట్లాడుతూ... కారైక్కాల్ ఆలయ భూముల మోసానికి సంబంధించిన కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, రాజకీయ నాయకులు, అధికారులు అని పక్షపాతం లేకుండా ఇందులో సంబంధమున్న ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించిన విచారణ బాధ్యతలను కార్యదర్శి నెడుంచొళియన్ అందుకున్నారని తెలిపారు. 1974లో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఆయా ఆలయాలకు సంబంధించి భూమి ఉందా? లేదా? అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. పుదుచ్చేరి, కారైక్కాల్‌కు భారీవర్ష సూచన ఉండటంతో అధికారులతో సమావేశం నిర్వహించామని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విచ్చేశాయని పేర్కొన్నారు. ఇందులో రెండు బృందాలు పుదుచ్చేరికి, ఒక బృందం కారైక్కాల్‌కు వెళ్తుందన్నారు.



రెస్క్యూ బృందాలతో మాట్లాడుతున్న ఎల్జీ కైలాష్‌నాథన్



ఆందోళన చేస్తున్న దృశ్యం

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు ఆందోళన

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు తాలూకా కలవై సబ్‌రిజిస్ట్రార్‌గా కయల్‌విళి పనిచేస్తున్నారు. ఈమె కార్యాలయానికి వచ్చే ప్రజలతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలకు మద్దతునిస్తున్నారని ఆరోపిస్తూ అన్నాడీఎంకే, పీఎంకే, వీసీకే, కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా మంగళవారం ఆందోళన చేపట్టాయి. దీనిపై విచారణ జరిపి సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

తిరువళ్లూరులో ఉద్యోగ మేళా 18న

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 18న ప్రైవేటు సంస్థల తరపున ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే శిబిరంలో 25కి పైగా ప్రైవేటు సంస్థలు పాల్గొని 500 ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పది, ప్లస్‌టూ, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసినవారు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, టెక్నీషియన్, మెషిన్ ఆపరేటర్, మేనేజ్‌మెంట్ ఉద్యోగాలకు www.tnprivatejobs.tn.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థుల పేర్లు ఉపాధి కల్పన కార్యాలయంలో రద్దు చేయమని, సీనియారిటీ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఏ త్యాగానికైనా సిద్ధం: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్నాడీఎంకేను అధికారంలోకి తెచ్చేందుకు ఏ త్యాగానికైనా సిద్ధమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2026లో అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో చీకటి పాలన సాగుతోందని విమర్శించారు. డీఎంకే ప్రభుత్వంలో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు.

అన్నాడీఎంకే బహిరంగసభ వాయిదా

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న కాంచీపురంలో నిర్వహించనున్న బహిరంగ సభను వాయిదా వేసినట్లు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

ఇజ్రాయెల్‌కు భారత్ మద్దతివ్వకూడదు: తిరుమా

సైదాపేట, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్‌కు భారత్ మద్దతివ్వకూడదని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఉపసంహరించుకుని పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ వీసీకే తరపున చెన్నై వళ్లువర్‌కోట్టంలో సోమవారం ఆందోళన జరిగింది. దీనికి పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ నేతృత్వం వహించారు. మనిదనేయ మక్కల్ కట్చి అధ్యక్షుడు జవహిరుల్లా, వీసీకే ఉప ప్రధాన కార్యదర్శి వన్నియరసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమావళవన్ మాట్లాడుతూ... ప్రపంచ దేశాలు భయపడే విధంగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శినే ఇజ్రాయెల్ బెదిరిస్తోందని చెప్పారు. దీన్ని ప్రపంచ దేశాలు ఖండించాయని పేర్కొన్నారు. భారతదేశం కూడా ఇజ్రాయెల్ వైఖరిని ఖండించాలని తెలిపారు. బాధితుల పక్షాన నిలవడమే నిజమైన న్యాయమని తెలిపారు.

ప్రభుత్వంపై కొరవడిన నమ్మకం: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం, చెన్నై మహానగర కార్పొరేషన్‌పై ప్రజలు నమ్మకం కోల్పోయారని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ఆరోపించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నైలో మంగళవారం ఉదయం వరకు 6 సెం.మీ వర్షం కురిసిందని తెలిపారు. దీనికే నగరంలో పలు చోట్ల నీరు నిలిచిందని, చాలా చోట్ల ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. ప్రభుత్వం, జీసీసీ తీసుకున్న వరద నివారణ పనులు పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదని విమర్శించారు. 6 సెం.మీ వర్షానికే పరిస్థితి ఇలాగుంటే 20 సెం.మీ వర్షం కురిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వాననీటి కాలువల పనులు 95 శాతం ముగిశాయని ఉత్తుత్తి ప్రకటనలు చేసుకుంటే సరిపోదన్నారు. కావున ప్రభుత్వం, కార్పొరేషన్ ప్రచారాలు మానుకుని ప్రజలను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



ప్యారిస్: సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలాం కుటుంబ సభ్యులు

ప్యారిస్, న్యూస్‌టుడే: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రామేశ్వరంలోని ఆయన స్మారక మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆయన కుటుంబ సభ్యులు సర్వమత ప్రార్థనలు చేశారు. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టరు సిమ్రాన్‌జీత్ సింగ్, సహాయ కలెక్టరు మొహ్మద్ ఇర్ఫాన్, అధికారులు పాల్గొని నివాళులర్పించారు. ముందుగా జిల్లా యంత్రాంగం తరపున మారథాన్ నిర్వహించారు. పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఎస్ఆర్‌కేఎం విద్యార్థులకు పోటీలు



వడపళని: విజేతలతో నిర్వాహకులు

వడపళని: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా టీనగర్ శ్రీరామకృష్ణ మిషన్ శారదా విద్యాలయాలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు జరిగాయి. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్ మద్రాస్, ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై సంయుక్తంగా నిర్వహించిన పోటీలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జలజ అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్ మద్రాస్ అధ్యక్షుడు ఆర్.విశ్వనాథన్, ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై అధ్యక్షుడు ఆర్.గోవిందరాజ్ తదితరులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



పులియంతోపు మార్కెట్ ప్రాంతంలో భారీగా నిలిచిన వాననీరు



కోయంబేడు బస్టాండులో..



బకింగ్‌హామ్ కాలువను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్



గర్భిణిని వాగు దాటించి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

గ్రామానికి నిలిచిన రాకపోకలు

విల్లివాక్కం: భారీ వర్షాలకు ఈరోడ్ జిల్లా భవానీసాగర్ సమీపంలోని మాయార్‌లో వరద ప్రవాహం అధికమైంది. తెంగుమరహాడ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. ఓ గర్భిణికి పురిటినొప్పులు రావడంతో తెప్ప ద్వారా మాయార్‌ను దాటించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.



విద్యుత్తు మోటారు సాయంతో వాననీటి తొలగింపు



వేలచ్చేరిలో స్థానికులను పడవల ద్వారా తరలిస్తున్న దృశ్యం



వేలచ్చేరి రామ్‌నగర్ పైవంతెనపై నిలిపిన కార్లు

భారీ వర్షాలు.. జోరందుకున్న సహాయక చర్యలు

ప్యారిస్, న్యూస్‌టుడే: అత్యంత భారీవర్ష హెచ్చరిక నేపథ్యంలో నివారణ శిబిరాలు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, అధికారులు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపడుతున్నారు. 85 లక్షల సెల్‌ఫోన్‌లకు ముందస్తు హెచ్చరికల సమాచారం పంపారు. తమిళనాడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌లో 444 సిబ్బందితో కూడిన 16 బృందాలు ఉన్నాయి. జాతీయ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌లో 10 బృందాలు సిద్ధంగా ఉన్నాయి. భారీవర్షాలకు సంబంధించి రాష్ట్ర ఎమర్జెన్సీ సెంటర్‌కి 249 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 215 ఫిర్యాదులను పరిష్కరించామని అధికారులు పేర్కొన్నారు.

వర్ష బాధిత ప్రాంతాల్లో మంత్రుల పర్యటన

కోయంబత్తూరు: కోయంబత్తూరులో కొద్ది రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ వర్ష బాధిత ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. రోడ్ల పక్కన, లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, మురికినీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, కార్పొరేషన్ కమిషనర్ శివగురుప్రభాకరన్ వెంట ఉన్నారు.

❖ **రెడ్‌హిల్స్:** తిరువళ్లూరు జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాష్ట్ర మంత్రి నాజర్ మంగళవారం ఆవడి, తిరువేర్కాడు, సేక్కాడు ప్రాంతాల్లో పర్యటించారు. వాననీటిని వెంటనే తొలగించాలని, రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆవడి మేయర్ ఉదయకుమార్, కమిషనర్ కందస్వామి, డీఎంకే సీనియర్ నేతలు నారాయణప్రసాద్, రాజేంద్రన్ వెంట ఉన్నారు.



రెడ్‌హిల్స్: బాధిత ప్రాంతంలో మంత్రి నాజర్

❖ **గుమ్మిడిపూండి:** గుమ్మిడిపూండి, పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గతేడాది కురిసిన అతి భారీ వర్షాలకు ఆరుణానది ఒడ్డున ఉన్న ఏలియంబేడు, మంగళం, కండ్రిగ, పుదువాయల్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గోవిందరాజన్ మంగళవారం పర్యటించి ముందు జాగ్రత్త చర్యలపై ఆరా తీశారు. ఇసుక బస్తాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఓడ ప్రయాణం రెండు రోజులు రద్దు

ఆర్కేనగర్: నాగపట్టిణం హార్బర్ నుంచి శ్రీలంక గంగేశన్‌తురై వరకు శివగంగై ఓడ వారంలో నాలుగురోజులు ప్రయాణికులు తీసుకెళుతోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మంగళవారం సేవలు రద్దు చేశారు. గురువారం కూడా ప్రయాణం ఉండదని నిర్వాహకులు తెలిపారు.

కొడివేరి చెక్‌డ్యామ్‌లో స్నానాలకు నిషేధం

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొడివేరి చెక్‌డ్యామ్ సందర్శనకు మూడు రోజులుగా పర్యాటకులు తగ్గారు. గోపిచెట్టిపాలయం, పరిసర ప్రాంతాలలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున భవాని నదిలో వరద ఏర్పడి కొడివేరి చెక్‌డ్యామ్ వద్ద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా మంగళ, బుధవారాలు చెక్‌డ్యాములో స్నానాలు నిషేధించినట్లు అధికారులు తెలిపారు.

ఎనిమిది విమానాలు రద్దు

వడపళని: భారీ వర్షాల కారణంగా చెన్నై నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు మంగళవారం రద్దయ్యాయి. వాతావరణం సరిగ్గా లేకపోవడం, ప్రయాణికులు తమ ప్రయాణాలు రద్దు చేసుకోవడంతో రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బెంగళూరు, దిల్లీ, మస్కట్, అండమాన్ నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన ఎనిమిది సర్వీసులు రద్దయ్యాయి. బెంగళూరు నుంచి ఉదయం 7.05కు బయలుదేరి రావాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, అండమాన్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, దిల్లీలో 2.30కు బయలుదేరాల్సిన ఇండిగో, మస్కట్ నుంచి రావాల్సిన ఓమన్ ఎయిర్ ఫ్లయిట్ విమానాలు చెన్నైకి రాలేదు. కావున ఆ ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీసులు రద్దు చేశారు. ఈ విమానాలు కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులు యథాతథంగానే కొనసాగుతున్నాయని, బయలుదేరే వేళల్లో ఏమైనా మార్పులను ప్రయాణికులు ముందుగానే తెలుసుకోవాల్సిందిగా అధికారులు సూచించారు.



రిప్పన్ బిల్డింగ్‌లోని కంట్రోల్ సెంటర్‌ని పరిశీలిస్తున్న ఉదయనిధి స్టాలిన్, చిత్రంలో మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ

వర్ష సహాయక పరికరాలు సిద్ధం

ఊత్తుకోట: ఊత్తుకోట, పరిసర ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షాలను ఎదుర్కొనేందుకు పట్టణ పంచాయతీ అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. అరుణానదిలో వరద ఏర్పడి నది తీరం కోతకు గురైతే పటిష్ఠం చేసేందుకు 500 ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే ఈదురుగాలులకు చెట్లు కూలితే వెంటనే తొలగించేందుకు భారీ రంపాలు, మురికినీటి కాలువల్లో పేరుకుపోయే చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ఆధునిక పరికరాలు సిద్ధం చేశారు.

సహాయక చర్యలపై సమాలోచన

పొన్నేరి: వర్షాలను ఎదుర్కొనేందుకు పొన్నేరిలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షంతో రోడ్లపై నిలిచే నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కమ్యూనిటీ హాళ్లను సిద్ధం చేయాలని, వాటిల్లో విద్యుత్తు ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరిమళం, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ తరఫున అన్నానగర్ జోన్ దాస్‌పురంలో ఆహారం పంపిణీ

ముందస్తు జాగ్రత్త చర్యలు

అరక్కోణం: రాణిపేట జిల్లా యంత్రాంగం వర్షాలు ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా విజిలెన్స్ అధికారిణి మరియా పల్లవి బల్దేవ్, జిల్లా కలెక్టరు చంద్రకళ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్కాడు మున్సిపాలిటీలోని పెరిహాసన్‌పుర వద్ద కాలువను పరిశీలించి పూడికతీయించాలని కమిషనర్‌ను ఆదేశించడంతోపాటు పనులను దగ్గరుండి పరిశీలించారు. వరదనీరు వాననీరు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టరు వెంట ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, ఆర్కాడు మున్సిపల్ అధ్యక్షురాలు బెన్స్ శ్రీదేవి, అధికారులు ఉన్నారు.

నీలగిరి జిల్లాలో 283 ప్రమాదకర ప్రాంతాలు

విల్లివాక్కం: నీలగిరి జిల్లాలో 283 ప్రాంతాలను ప్రమాదకరమైనవిగా గుర్తించి పర్యవేక్షిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ తన్నీరు లక్ష్మీభవ్య తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 456 పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు. అగ్నిమాపకశాఖ తరఫున గత మూడు రోజులుగా వర్ష ప్రభావం, జాగ్రత్త చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి రిహార్సల్స్ జరిపినట్టు తెలిపారు. 42 జోనల్ బృందాలు రాత్రి సమయంలో ప్రమాదకరమైన ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.



వేళచ్చేరి: తీరంలో లంగరు వేసిన పడవలు

చేపల వేటకు నిషేధం

ప్యారిస్: రామనాథపురం జిల్లాకు భారీ నుంచి అతి భారీవర్ష సూచన ఉండటంతో జాలర్లు తమ పడవలను సురక్షితంగా ఉంచుకోవాలని, తదుపరి ఉత్తర్వు వచ్చే వరకు చేపల వేటకు వెళ్లకూడదని మత్స్యశాఖ సహాయ డైరెక్టరు శివకుమార్ తెలిపారు. అదేవిధంగా జాలర్లకు ఇచ్చిన అనుమతి రసీదుని రద్దు చేశారు. దీంతో మండపం, పాంబన్, రామేశ్వరం, ఏర్వాడి, కీళక్కరై మొదలైన 30కి పైగా గ్రామలకు చెందిన జాలర్లు తమ పడవలను తీరంలో సురక్షితంగా నిలిపి ఉంచారు.

● **వేళచ్చేరి:** ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినందున మత్స్యకారులు సముద్రానికి చేపల వేటకు వెళ్లరాదని కడలూర్ జిల్లా మత్స్యశాఖ అధికారులు సూచించారు. సముద్రంలో గంటకు 45 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. అదే సమయంలో ప్రస్తుతం వేటకు వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు.

● **పొన్నేరి:** పొన్నేరి సమీప పళవేర్కాడు దీవిలోని మత్స్యకారులు మరో నాలుగైదు రోజుల వరకు చేపల వేటకు వెళ్లరాదని తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి ఆర్.గాంధీ

అరక్కోణం: ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆర్.గాంధీ సూచించారు. రాణిపేట కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ముందస్తు ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు చంద్రకళ, ఎస్పీ కిరణ్‌శృతి, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్ప, డీఆర్వో సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అరక్కోణం: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గాంధీ



వివిధ ప్రాంతాల పరిస్థితి తెలుసుకుంటున్న మంత్రులు కేఎన్ నెహ్రూ, టీఎం అన్బరసన్ తదితరులు

ముమ్మరంగా కాలువల్లో పూడికతీత

మహాబలిపురం: తాంబరం మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్షపునీరు ప్రవహించే కాలువల్లో పూడిక తీసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. మంగళవారం మంత్రులు కేఎన్ నెహ్రూ, టీఎం అన్బరసన్ తదితరులు పల్లావరం కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, ఇరుంబులియూర్ ప్రాంతంలో చేపడుతున్న వాన నీటి కాలువల నిర్మాణం, తాంబరం-కిష్కింధ రోడ్డులో చేపడుతున్న రోడ్డు పనులు పరిశీలించారు. అనంతరం నెహ్రూ విలేకరులతో మాట్లాడారు. వర్షపు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి తగినన్ని పడవలు సిద్ధంగా ఉంచామన్నారు. తాంబరంతో పాటు కుండ్రత్తూర్, పూందమల్లి, మాంగాడు, ఆవిడి ప్రాంతాల్లోనూ పరిశీలించామన్నారు.



జీరో పాయింట్‌కు చేరుకుంటున్న తెలుగు గంగ నీరు

చెరువులకు పెరిగిన నీటరాక

రెడ్‌హిల్స్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా చెన్నై వాసులకు తాగునీరు అందించే పూండి, పుళల్, చోళవరం, చెంబరంబాక్కం, కన్నన్‌కోట్టై చెరువుల పరివాహక ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మంగళవారం చెరువులకు నీటిరాక అధికమైంది. పూండికి 240 క్యూసెక్‌లు, పుళల్‌కు 277, చోళవరానికి 160, చెంబరంబాక్కానికి 260, కన్నన్‌కోట్టైకు 60 క్యూసెక్‌ల నీరు చేరుకుంటోంది. అదేవిధంగా తెలుగు గంగ పథకం కింద కండలేరు జలాల రాక కూడా అధికమైంది. ఊత్తుకోట సమీప తామరైకుప్పం జీరో పాయింట్‌కు 405 క్యూసెక్, పూండి చెరువుకు 410 క్యూసెక్‌ల వంతున నీరు చేరుకుంటోంది.

వైభవంగా ప్రదోషోత్సవం



తిరువణ్ణామలై: మహానందికి చందనాభిషేకం చేస్తున్న దృశ్యం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోషోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని వేకువజామున తెరిచారు. మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయంలో ఉన్న మహానంది సహా 15 నంది విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తులైన ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి బంగారు వృషభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ సమయం ప్రకటన

ఆలయంలో పెరటాసి మాస పున్నమిరోజు గిరి ప్రదక్షిణకు తగిన సమయాన్ని ఆలయ అధికారులు ప్రకటించారు. పెరటాసి మాస పున్నమి అక్టోబరు 16వ తేదీ బుధవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమై 17వ తేదీ సాయంత్రం 5.38 గంటలకు ముగుస్తున్నట్లు ప్రకటించారు.



తిరువణ్ణామలై: వృషభ వాహనంపై చంద్రశేఖరుడు



పళ్లిపట్టు: అలంకరణలో పార్వతి సమేత సంగమేశ్వరస్వామి

పళ్లిపట్టు: పళ్లిపట్టు పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోషోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవర్లకు, నంది విగ్రహానికి అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఉత్సవమూర్తులను అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలశాల ఊరేగింపు

ఘనంగా కుంభాభిషేకం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప సిరుపుళల్‌పేట పంచాయతీ పరిధిలోని ముత్తురెడ్డికండ్రిగలో పురాతన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాల్ ఆలయం శిథిలావస్థకు చేరింది. భక్తుల విరాళాలతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో మంగళవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలయాగ పూజలు, అగ్నిపారాయణం, అగ్ని సంప్రోక్షణం, గోపూజ, మహాపూర్ణాహుతి నిర్వహించారు. గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పవిత్ర జలాలున్న కలశాలను గ్రామ దేవత ఆలయం నుంచి ఊరేగింపుగా పెరుమాల్ ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను విమాన కలశాలపై అభిషేకించారు.

వరాహస్వామికి హనుమంత వాహన సేవ

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా కీళ్‌పొదట్టూర్ ప్రాంతంలో ధరణి వరాహ స్వామి ఆలయం ఉంది. ఆలయంలో రెండు రోజులుగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం సాయంత్రం స్వామివారిని అలంకరించి హనుమంత వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.



హనుమంత వాహనంపై వరాహస్వామి

ఇద్దరు చిన్నారుల హత్య

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా పనమరత్తుపట్టి ఓడువాన్‌కాడుకు చెందిన రైతు రాజా పిల్లలు నవీనా (17), సుగన్ (14) సోమవారం హత్యకు గురయ్యారు. రాజా, అదే ప్రాంతానికి చెందిన ధనశేఖర్ మధ్య ఆస్తి తగాదాలున్న నేపథ్యంలో ధనశేఖర్ ఈ హత్య చేసినట్లు గుర్తించి పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కాగా హత్య కేసుతో సంబంధం ఉన్న కార్తి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రాజా కుటుంబీకులు, బంధువులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు.



నవీనా, సుగన్ (పాతచిత్రాలు)

రోడ్డు ప్రమాదంలో ‘దినభూమి’ యజమాని మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో దినభూమి వార్తాపత్రిక యజమాని మృతిచెందగా, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మదురై కేకే నగర్‌కి చెందిన మణిమారన్(65) దినభూమి యజమాని. ఆయన కుమారుడు సతీష్(45). ఇద్దరూ సోమవారం కన్నియాకుమరి నుంచి మదురైకి కారులో బయల్దేరారు. కారుని సతీష్ నడిపారు. కోవిల్పట్టి నాలాట్టిన్‌పుత్తూర్ హైవే వద్ద ఉన్న వంతెనపై వెళ్తుండగా అదుపుతప్పి సెంటర్ మీడియన్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. మణిమారన్ అక్కడికక్కడే మృతిచెందారు. రమేష్‌కుమార్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి సంతాపం.. మణిమారన్ మృతికి సీఎం స్టాలిన్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి, దినభూమి సిబ్బందికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అనుమానాస్పదంగా యువకుడు...

వేలూర్: వేలూర్ జిల్లా పేర్నంబట్టు సమీప పంటలదొడ్డికి చెందిన శ్రీనివాసన్ యూనియన్ డీఎంకే అధ్యక్షుడు. ఇతని కుమారుడు ప్రశాంత్ (20) మూడు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం గ్రామ పొలిమేరలోని ఓ పొలంలో కాళ్లకు విద్యుత్తు తీగలు కట్టిన స్థితిలో ప్రశాంత్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ప్రశాంత్ హత్యకు గురయ్యాడని, హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు రాస్తారోకో చేపట్టారు.



ప్రశాంత్ (పాతచిత్రం)

ట్రాక్టర్ ఢీకొని మహిళ...

అరక్కోణం: రాణిపేట జిల్లా నెమలి సమీప అసనెల్లికుప్పం గ్రామానికి చెందిన గణేశన్ భార్య కామాక్షి (50) తన ఇంటి సమీపంలో సోమవారం రాత్రి నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ ట్రాక్టర్ బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అరక్కోణం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆర్ముగాన్ని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని రైల్వే ఉద్యోగి...

రెడ్‌హిల్స్: ఆవడి సమీప అనైకట్టుచ్చేరికి చెందిన సురేష్ రైల్వే ఉద్యోగి. ఇతను సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టాభిరాం వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతన్ని పెరంబూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందాడు. ఆవడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కన్నమ్మాళ్, కుమారులు రాహుల్, భరత్ ఉన్నారు.



సురేష్ (పాతచిత్రం)

పోక్సో చట్టం కింద ప్రధానోపాధ్యాయుడి అరెస్టు

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని ఓ ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ఉంది. ఇందులో 28 ఏళ్ల మహిళ ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. తనను ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణి లైంగికంగా వేధించాడని ఆమె జోలార్‌పేట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు పరారయ్యాడు. అతన్ని అరెస్టు చేయాలనే డిమాండుతో బాధితురాలి బంధువులు పోలీసుస్టేషన్‌ను మంగళవారం ముట్టడించి ఆందోళనకు దిగారు. పోలీసులు సుబ్రమణిని అరెస్టు చేయడంతో శాంతించారు.

2 రోజుల్లో 62 మంది నేరస్థులు...

రెడ్‌హిల్స్: నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆవడి పోలీసు కమిషనర్ శంకర్ పోలీసులను ఆదేశించారు. ఆ మేరకు పోలీసులు ఆది, సోమవారాల్లో వాహనాలు, ఇతర తనిఖీలు చేపట్టి గుట్కా, గంజాయి తరలించిన, జూదమాడిన 54 మందిని అరెస్టు చేశారు. వీరంతా పాత నేరస్థులు కావడం గమనార్హం. అదేవిధంగా బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టుకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు శంకర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

బస్సు బోల్తా.. 20 మందికి తీవ్ర గాయాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి ప్రయాణికులతో హోసూర్ మార్గంగా ధర్మపురి వైపు మంగళవారం ఉదయం ఓ ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. బస్సు పాలక్కోడు సమీపంలోని కొడియూర్ వద్ద వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొనకుండా డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. అటుగా వెళ్తున్న వాహనచోదకు బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను బయటికి తీసుకొచ్చారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన 20 మందిని పాలక్కోడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.